హైదరాబాద్ వార్త



# నగరం గజగజ..!

**-ఆరేళ్ల తర్వాత మళ్లీ విజృంభించిన చలిపులి -ఒక్కసారిగా పడిపోయిన ఉష్ణోగ్రతలు**



**హైదరాబాద్, డిసెంబరు 16 ప్రభాతవార్త**

ఆరేళ్ల తర్వాత మళ్లీ నగరంలో చలి పులి విజృంభించింది. నగరవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు ఉన్నట్లుండి ఒక్కసారిగా పడిపోయాయి. దీంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేదు. ఎండ కాస్తున్నా..చలి మాత్రం తగ్గడం లేదు. ఉదయం వేళలో 8 గంటల వరకు కూడా రోడ్లపైన జనాలు కనిపించడం లేదు. సాయంత్రం 8గంటల తర్వాత బయటికి వెళ్లాలంటేనే వణికిపోతున్నారు ప్రజలు.చాలా చోట్ల సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం రాత్రి నుంచి ఉన్నట్లుండి మారిపోయిన వాతావరణం తెల్లవారుజామున పొగ మంచు కప్పేసింది. హైదారాబాద్‌లో అత్యల్పంగా మౌలాలి, హెచ్‌సీయూ ప్రాంతాల్లో 7.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాజేంద్రనగర్ 8.2, బీహెచ్‌ఈఎల్‌లో 7.4 డిగ్రీలు, శివరాంపల్లిలో 10.3, బాలానగర్ 11.5, పటాన్‌చెరు 11.7, షాపూర్ నగర్ 11.7, బోయిన్‌పల్లి 11.9, గచ్చిబౌలి 9.3, మచ్చబొల్లారంలో 10.2, కత్బుల్లాపూర్ 10.2, వెస్ట్ మారేడ్‌పల్లిలో 9.9, ఆసిఫ్‌నగర్ 12, బేగంపేట 12, మోండా మార్కెట్ 12.4, నేరెడ్‌మెట్ 12.1, లంగర్‌హౌస్ 12.2, చందానగర్ 12.7, మాదాపూర్ 12.8, ముషీరాబాద్ 12.9, కూకట్‌పల్లి 13.1, సఫిల్‌గూడ 13.3, మల్లాపూర్ 13.5, ఆదర్శనగర్ 13.5, చాంద్రాయణగుట్ట 13, షేక్‌పేట్ 12.8, హయత్‌నగర్ 13.3, ఉప్పల్ 13.4 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.మరోవైపు బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో చలిగాలులు విజృంభిస్తున్నాయి.

**పడిపోతున్న గాలినాణ్యత..**

ఓ వైపు చలితో జనాలు అల్లాడిపోతుంటే.. మరో వైపు నానాటికి పడిపోతున్న గాలినాణ్యత డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. దీంతో జనజీవనం ప్రశ్నార్థకంగా మారింది. ఆదివారం నగరంలో దాదాపు 300 ఎక్యూఐ నమోదైంది. సోమవారం మధ్యాహ్నం నాటికి గాలి నాణ్యత కాస్త కోలుకుంది. దీంతో గత ఆరేళ్లలో ఎన్నడూలేని విధంగా ఉష్ణోగ్రతలు గరిష్టంగా నమోదవుతున్నాయి. ఉత్తరాధి నుంచి ఈదురుగాలులు, శీతల పవనాలు వీస్తుండటంతో ఉష్ణోగ్రతలు మరింత పడిపోతున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు..**

మరోవైపు అత్యల్పంగా నమోదువుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. బయటకు వెళ్లే సమయంలో ముదురు రంగు దుస్తులు ధరించాలని తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు వేడి పానియాలు తీసుకోవాలని చెప్పారు. ఆస్తమ రోగులు బయటకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు.చలికాలంలో వృద్ధులు తమ ఆరోగ్యంపై దృష్టి సారించాలని జనరల్ ఫిజిషియన్ డాక్టర్ ధనుంజయ సూచించారు. దగ్గు, జలుబు, ఆస్తమా వంటి వ్యాధులపై నిర్లక్ష్యంగా ఉంటే ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు, హృద్రోగ సమస్యలు, ఇతరత్రా రోగాల బారిన పడే ప్రమాదం ఉంది హెచ్చరించారు. చల్లటి వాతావరణంలో కీళ్లనొప్పులు పెరుగుతాయని చెప్పారు. చలిలో వైరల్ ఫ్లూ ఎక్కువగా వ్యాప్తి చెందుతుందని, వ్యాక్సిన్ తీసుకోవటం ద్వారా రోగనిరోధకశక్తి పెంచుకోవచ్చని తెలిపారు.సరైన నిద్రతోపాటు నడక, వ్యాయామం ఎంతో మేలంటున్నారు.

## శిల్పా లేఅవుట్ ఫ్లైఓవర్ పనులు త్వరగా పూర్తి చేయాలి

**-జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి**



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషర్ ఇలంబర్తి, జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** శిల్పా లేఅవుట్ సెకండ్ లెవెల్ ఫ్లైఓవర్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన గచ్చిబౌలి నుండి కొండాపూర్‌కు వెళ్ళే శిల్పాలే అవుట్ సెకండ్ లెవెల్ ఫ్లైఓవర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... సర్వీస్ రోడ్డు కు సంబంధించిన భూసేకరణ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. భూసేకరణలో ప్రభుత్వ పాఠశాల భవనం కొంత మేరకు కోల్పోతున్నదున విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిఎస్ఆర్ పద్ధతిలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని జోనల్ కమీషనర్‌ను ఆదేశించారు. విద్యార్థులు రోడ్డుకు ఇరువైపులా దాటి వెళ్లిన సందర్భంలో ప్రమాదం సంభవించకుండా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు నిర్దేశించిన కాల వ్యవధిలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఈ ఫ్లై ఓవర్ అందుబాటులోకి వస్తే గచ్చిబౌలి జంక్షన్ నుండి కొండాపూర్ వరకు ట్రాఫిక్ ఇబ్బందులు సకాలంలో గమ్యానికి చేరే వెసులుబాటు ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిహెచ్ఎంసి నగర వాసులకు మెరుగైన రవాణా వ్యవస్థను ఏర్పాటు కృషి చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు సి.ఈ దేవానంద్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, ఎస్.ఈ శంకర్ నాయక్, డిసి ముకుందా రెడ్డి, ఈఈ హరీష్ నాయక్, టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ హెల్త్ ఆఫీసర్ రజనీ కాంత రెడ్డి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**-జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి**



ఆర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ ఇలంబర్తి తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమీషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమీషనర్ పాల్గొని పలు సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ... ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంపై ఆయా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు.ప్రజావాణి ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 4 విన్నపాలు రాగా, పరిష్కారం నిమిత్తం ఆయా విభాగాలకు పంపించడం జరిగింది. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 43 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 19, ఇంజనీరింగ్ 9, ఎఫ్.ఏ సెక్షన్ 4, ఎలక్ట్రికల్, అర్బన్ బయోడైవర్సిటీ 2 చొప్పున రాగా, ట్యాక్స్, అడ్మినిస్ట్రేషన్, శానిటేషన్, స్పోర్ట్స్, ఎస్టేట్, హెల్త్, లేక్స్ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు అందాయి. జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 99 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్ లో 53, సికింద్రాబాద్ జోన్ లో 20, శేరిలింగంపల్లి జోన్ లో 12, చార్మినార్ జోన్ లో 8, ఎల్బీనగర్ జోన్ లో 6 విన్నపాలు రాగా ఖైరతాబాద్ జోన్ లో ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, సుభద్ర దేవి, నళిని పద్మావతి, పంకజ, సరోజ, చంద్రకాంత్ రెడ్డి, సత్యనారాయణ, రఘు ప్రసాద్, యాదగిరి రావు, వేణు గోపాల్ రెడ్డి, అడిషనల్ సి.సి.పి లు గంగాధర్, ప్రదీప్, ఏ.సి.పి సుదర్శన్, ఎస్టేట్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, వాటర్ వర్క్స్ డి.జి.ఎం. సాయి రమణ, లేక్స్ ఈఈ నారాయణ, హౌసింగ్ ఈ ఈ రాజేశ్వర్, యు.బి.డి డైరెక్టర్ శ్రీనివాస రావు, ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలర్ మూర్తి రాజు, ఏ.ఎం.సి లు జీవన్ కుమార్, శారద తదితరులు పాల్గొన్నారు.

## జనరంజకం మేఘన కూచిపూడి రంగప్రవేశం



మేఘన కూచిపూడి నృత్యప్రదర్శనలో దృశ్యం

**రవీంద్రభారతి, డిసెంబరు 16 ప్రభాతవార్త :** చూడచక్కని హావభావ ప్రకటన, శృతి లయబద్ధంగా మేఘన గార్లపాటి ప్రఖ్యాత నాట్యగురువు కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డా. భాగవతుల సేతురామ్ వద్ద సంపూర్ణం భారతీయ శాస్త్రీయనృత్యం అభ్యసించి ముగ్ధమనోహరంగా కూచిపూడి నృత్యవిన్యాసంతో రంగప్రవేశంలోనే రసరమ్యం, జనరంజకంగా ఆహుతులను అలరించి ఆకట్టుకుంది. సోమవారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో తన కూచిపూడి రంగప్రవేశాన్ని మేఘన ముందుగా విఘ్నేశ్వర ధరువు మోదమున అంశంతో ప్రారంభించి శివకీర్తన శివశిక అనరాదా; మహిషాసుర మర్ధని స్తోత్రం; తరంగం; జావళి, భామాకలాపం మదనాధరువు అంశాలను నేత్రపర్వంగా ప్రదర్శించి అందరి ప్రశంసలందుకుంది. ముఖ్యంగా అయిగిరినందినిలో అమ్మవారిని దివ్యరూపాన్ని సాక్షాత్కరించి కళ్లకు కట్టించి, తరంగంలో పళ్లెంపై పదవిన్యాసం మంత్రముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అలేఖ్య పుంజాల, ఉమామహేశ్వరి, చంద్రమోహన్‌రెడ్డి, కళాకృష్ణ, వనజ ఉదయ్ తదితరులు నాట్యగురువు డా. భాగవతుల సేతు రామ్‌లను ఎంతగానో అభినందించి కళాకారిణి మేఘనకు శుభాశీస్సులందజేశారు.

## బొమ్మ ఫిస్తోలు చూపించి బార్‌లో యువకులు దోపిడీ

**-స్నేహితుడితో కలిసి రూ.4.50 లక్షలు, ఎలక్ట్రానిక్ వస్తువులు చోరీ చేసిన బార్ మజీ ఉద్యోగి**

**-నిందితుడి అరెస్టు - రూ 5లక్షల విలువైన సొత్తు స్వాధీనం**



నిందితుడి వద్ద స్వాధీనం చేసుకున్న నగదు, బొమ్మ ఫిస్తోలు, ఎల క్ట్రానిక్ వస్తువులు

**గచ్చిబౌలి, డిసెంబరు 16 ప్రభాతవార్త**

తనను ఉద్యోగంలో నుంచి తొలగించారనే కోపం... ఎక్కడా పని దొరకడం లేదనే అక్కసుతో ఇద్దరు యువకులు దొంగతనానికి పాల్పడ్డారు. తాను గతంలో పనిచేసిన బార్ అండ్ రెస్టారెంట్‌లోనే ఓ మాజీ ఉద్యోగి స్నేహితుడితో కలిసి దోపిడీకి ప్పాడ్డాడు. బొమ్మ ఫిస్తోలు చూపించి, సెక్యూరిటీ గార్డును బంధించి బార్ అండ్ రెస్టారెంట్‌లో 4.50లక్షల రూపాయల నగదు, పలు ఎలక్ట్రానిక్ వస్తువులను చోరీ చేశారు. చివరికి బార్ అండ్ రెస్టారెంట్ మాజీ ఉద్యోగి పోలీసుల చేతికి చిక్కగా, అతని స్నేహితుడు పరారీలో ఉన్నాడు. నిందితుడి వద్ద నుంచి చోరీ చేసిన ఎల క్ట్రానిక్ వస్తువులతో పాటు నగదును స్వాధీనం చేసుకున్నారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని నాలెడ్జ్ సిటీలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు కథనం ప్రకారం... ఒడిస్సా రాష్ట్రం పూరీ జిల్లాకు చెందిన శుభంకుమార్ జెనా(26), బిశ్వజిత్ పాండా(25)లు నగరానికి వచ్చి యూసుఫ్‌గూడలో ఒకే గదిలో నివాసం ఉంటున్నారు. శుభంకుమార్ జెనా గచ్చిబౌలి నాలెడ్జ్ సిటీ అర్గస్ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న టీవర్ బార్ అండ్ కిచెన్‌లో ఉద్యోగం చేసేవాడు. కాగా గత మూడు నెలల క్రితం శుభంకుమార్ పనితీరు నచ్చక బార్ యాజమాన్యం శుభంకుమార్‌ను పనిలో నుంచి తొలగించింది. ఇదే సమయంలో తన స్నేహితుడు బిశ్వజిత్ పాండా ఉద్యోగం సైతం పోవడంతో ఇద్దరు ఖాళీగా ఉనా న్నరు. గత మూడు నెలలుగా వీరు ఉద్యోగం కోసం ప్రయత్నించగా, ఎక్కడా ఉద్యోగం లభించలేదు. దీంతో తనను ఉద్యోగంలో నుంచి తొలగించిన టీవర్ బార్ యాజమాన్యం మీద కసి పెంచుకున్న శుభంకుమార్ అదే బార్‌లో చోరీ చేయాలని స్నేహితుడితో కలిసి పథకం వేశాడు. ఇందులో భాగంగా ఓ బొమ్మ ఫిస్తోలును కొనుగోలు చేశారు. ఈమేరకు ఈనెల 9వ తేదీన శుభంకుమార్, బిశ్వజిత్‌లు ముఖానికి ముసుగులు ధరించి ఉదయం 6 గంటల ప్రాంతంలో టీవర్ బార్ అండ్ కిచెన్ లోపలికి ప్రవేశించారు. ఉదయం పూట కావడంతో బార్‌లో ఎవ్వరూ లేకపోగా, కాపలాగా ఉన్న సెక్యూరిటీ గార్డును బొమ్మ ఫిస్తోలు చూపించి బెదిరించారు. సెక్యూరిటీ గార్డు వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను తీసుకొని అతన్ని స్టోర్ రూమ్‌లో బంధించారు. అనంతరం బార్‌లో ఉన్న కౌంటర్ తాళాలు తీసుకొని లాకర్‌లో ఉన్న 4.50లక్షల రూపాయల నగదు, ఓ ఐప్యాడ్, ల్యాప్‌టాప్‌ను దోపిడీ చేసి అక్కడి నుంచి పారిపోయారు. ఈ విషయమై సెక్యూరిటీ గార్డు తన బార్ యజమానుల్లో ఒకరైన కెవిఎన్. శ్యామ్ అనిరుథ్‌కు సమాచారం అందించాడు. దీంతో శ్యామ్ అనిరుథ్ రాయదుర్గం పోలీసులకు పిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న రాయదుర్గం పోలీసులు బార్ లోపల ఉన్న సిసి కెమెరాలు, బార్ పరిసరాల్లో ఉన్న సిసి కెమెరాలను పరిశీలించి బార్ మాజీ ఉద్యోగి శుభంకుమార్ దోపిడీకి పాల్పడినట్లు గుర్తించారు. ఈమేరకు నిందితుడి కోసం గాలింపు చేపట్టిన రాయదుర్గం పోలీసులు సోమవారం శుభం కుమార్ ఒడిస్సా వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా, సికిం ద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 5లక్షల రూపాయల విలువైన 1.50 లక్షల నగదు, ఓ ఐప్యాడ్, ఓ ల్యాప్‌టాప్‌ను, చోరీకి ఉపయోగించిన బొమ్మ ఫిస్తోలును స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు బిశ్వజిత్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## నేడు షెడ్యూల్ కులాల ఏకసభ్య కమిషన్ బహిరంగ విచారణ

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**హైదరాబాద్, డిసెంబరు 16,ప్రభాతవార్త:** ఎస్సి కులాల ఉప వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్ నేడు మంగళవారం బహిరంగ విచారణ నిర్వహించి వినతులు స్వీకరిస్తుందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఏకసభ్య కమిషన్ షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణకై విచారణాత్మక అధ్యయనం కోసం హైదరాబాద్ జిల్లా పరిధిలో బహిరంగంగా విచారణ చేపట్టేందుకు మంగళవారం హైదరాబాద్‌కు వస్తున్నాదని, జిల్లాలోని ఎస్సీ కులాల సంఘం నాయకులు ఇట్టి బహిరంగ విచారణలో అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 2.30 గంటల వరకు హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో విచారణ కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ బహిరంగ విచారణలో వినతులు స్వీకరిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## గాయపడ్డ శ్రీతేజను పరామర్శించిన బూర నర్సయ్యగౌడ్



శ్రీతేజ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్

**చిక్కడపల్లి, డిసెంబరు 16 ప్రభాతవార్త:** ఆర్టీసిక్రాస్‌రోడ్స్ సంధ్య థియేటర్లో సినిమాకి వెళ్లి తొక్కిసలాట ఘటనలో అపస్మారక స్థితిలోకి ఉన్న శ్రీతేజను సోమవారం భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ సందర్శించి పరామర్శించారు. కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ ఆరోగ్య పరిస్థితిని కిమ్స్ డాక్టర్లని నర్సయ్యగౌడ్ అడిగి తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. త్వరతగా శ్రీతేజ కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

## సదస్సులు, సభలు, ర్యాలీలు నిర్వహించాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఇ.టి.నర్సింహ్మా

**సైఫాబాద్, డిసెంబరు 16 ప్రభాతవార్త:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఏర్పడి వంద సంవత్సరాలు కావస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని అన్ని ప్రాంతాల్లో పార్టీ పతాకాల ఆవిష్కరణలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇ.టి.నర్సింహ్మా కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ శతాబ్ధి ఉత్సవాలను పురస్కరించుకుని పార్టీ చేసిన త్యాగాలు, పోరాటాలు, విజయాలను ప్రజలకు వివరించడానికి సదస్సులు, సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలని ఆయన సూచించారు. సోమవారం హిమాయత్‌నగర్‌లో జరిగిన సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన ఆలోచనలు కలిగిన యువతను అకట్టుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. పార్టీ క్షేత్రస్థాయిలో పనిచేసే పారిశుధ్యకార్మికుల నుంచి మొదలుకొని విమానాల్లో పనిచేసే ఎయిర్ హోస్టస్ వరకు వారి సమస్యలు పరిష్కారం కోసం సంఘాలను నియమించి కోట్లాది మంది ప్రజల కోసం అశేష త్యాగాలు చేసి హక్కులు సాధించడం జరిగిందని ఆయన వివరించారు. విద్యార్థి, యువజన, కార్మిక, రైతు, మహిళా, కళాకారుల, మేధావుల సంస్థలను నిర్మించిన చరిత్ర సిపిఐకి ఉందన్నారు. సిపిఐ హైరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.చాయాదేవి మాట్లాడుతూ ఆనేక అబద్ధాలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రజా సమస్యలను పరిష్కారించడంలో ఘోరంగా విఫలం చెందిందని ఆరోపించారు. కొద్ది మంది కార్పోరేట్ దోపిడీదారులకు దేశ సంపదను ప్రధాని నరేంద్రమోదీ దోచిపెడుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. ఈ సమావేశానికి మామిడి చెట్ల వెంకటస్వామి అధ్యక్షత వహించగా, జిల్లా సహాయ కార్యదర్శులు స్టాలిన్, కమితం యాదగిరి, సభ్యులు బి.వెంకటేశం, నెర్లకంటి శ్రీకాంత్, పడాల నళిని తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై భవన వ్యర్థాలు వేస్తే చర్యలు

**-సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఎసిపి శ్రీధర్**

**-రోడ్డుపై వ్యర్థాలు వేసిన యాజమానికి జరిమానా**



**అత్తాపూర్ డిసెంబరు16,ప్రభాతవార్త :** రోడ్డుపై వ్యర్థాలు,చెత్త వేసి వాహనాదారులు,ప్రజలకు ఇబ్బందులు కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఎసిపి శ్రీధర్ హెచ్చరించారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అరంఘర్ నుండి గగహన్‌పహాడ్ వెళ్లే సర్వీస్ రోడ్డులో భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్డుపై వెసి ఇతరులకు ఇబ్బందులు కలిగేలా పనులు సాగిస్తుండడంతో సోమవారం జిహెచ్ఎంసి అధికారులు కోరడా ఝులిపించారు.డిసి రవి కుమార్ ఆదేశాల మేరకు వ్యర్థాల ప్రదేశాన్ని పరిశీలించిన ఎసిపి శ్రీధర్ యాజమానికి 10 వేల రూపాయల జరిమానాను విధించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై ఇతరులకు ఇబ్బందులు కలిగేలా వ్యర్థాలను వేసి పనులు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎవరైన భవనలకు సంబంధించిన వ్యర్థాలను రోడ్డుపై పడిసి వెళ్లిన పనులు సాగించిన చర్యలు తప్పవనిహెచ్చరించారు.ఈకార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు ఎక్సలెన్స్ అవార్డు



సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు ఎక్సలెన్స్అవార్డును అందజేస్తున్న రక్షణ శాఖ డైరెక్టర్ జనరల్ రాజేశ్వరన్, చిత్రంలో సిఈఓ మధుకర్ నాయక్ బోర్డు మెంబర్, సూపరిండెంట్‌లు దేవేందర్, మహేందర్ తదితరులు

**కంటోన్మెంట్,డిసెంబరు 16 ప్రభాతవార్త:** స్వచ్ఛ ఛావని కెటగిరీల్లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు రక్షణ శాఖ మంత్రిత్వ శాఖ ఎక్సలెన్స్2024 అవార్డును సోమవారం న్యూ ఢీల్లిలోని చాణక్య ఆడిటోరియంలో రక్షణ శాఖ మంత్రి సజయ్ సేత్, రక్షణ శాఖ డైరెక్టర్ జనరల్ జి.ఎస్.రాజేశ్వరన్ చేతుల మీదుగా బోర్డు సిఈఓ మధుకర్ నాయక్, నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ, హెల్త్ సూపరిండెంట్ ఎం.దేవేందర్, శానిటరీ సూపరిండెంట్ ఏ.మహేందర్‌లకు అందజేశారు. చెత్త సేకరణ, పారిశుద్ధ్య కార్మికుల కృషితో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు కేంద్ర రక్షణ శాఖ నుంచి ఎక్సలెన్స్అవార్డు దక్కడం సంతోషకరమని మధుకర్ నాయక్ తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాలను పరిశుభ్రమైన పచ్చదనంతో ఆరోగ్యవంతమైన ప్రాంతంగా మార్చేందుకు మరింత చర్యలు తీసుకుంటామని సిఈఓ మధుకర్ నాయక్, రామక్రిష్ణలు తెలిపారు.

## పెట్రోల్ ట్యాంక్ అదుపుతప్పి బోల్తా

**-20 వేల లీటర్ల డీజిల్, పెట్రోల్ వృధా**



ఆలుగడ్డ బావి చౌరస్తాలో బోల్తాపడ్డ ఆయిల్ ట్యాంకర్‌ను,పెట్రోల్,డిజిల్ ట్యాంకర్‌ను పరిశీలిస్తున్న డిసిపి రష్మిపెరుమాల్

**కంటోన్మెంట్,డిసెంబరు 16 ప్రభాతవార్త:** పెట్రోల్,డిజిల్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తాపడిన సంఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చర్లపల్లి నుంచి నాచారం, తార్నాక,సంగీత్ చౌరస్తా మీదుగా సూరారం వైపు వెళ్తున్న ఏపి 29డబ్ల్యు0893 నెంబర్ గల ఆయిల్ ట్యాంకర్ 50 లీటర్ల లోడ్‌తో వెళ్తుండగా సోమవారం మధ్యాహ్నం ఆలుగడ్డ బావి చౌరస్తా నుంచి సంగీత్‌వైపు టర్నింగ్ చేసుకుంటుండగా అకస్మాత్తుగా టైర్ పంక్చర్ అయి బోల్తా పడింది. అందులోని డిజిల్,పెట్రోల్ ఏరులై పారింది. విషయం తెలుసుకున్న ఉత్తర మండలం డిసిపి పి.రష్మిపెరుమాల్, గోపాపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరాములు, లా అండర్ ఆర్డర్ నరేశ్‌లు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పర్యవేక్షించారు. దీంతో సికింద్రాబాద్ స్టేషన్ గాంధీ ఆసుపత్రి, సంగీత్ చౌరస్తా, ప్యాట్నీ, ప్యారడైజ్, జెబిఎస్ వైపు వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచి పోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పెట్రోల్ ట్యాంక్ అదుపుతప్పి బోల్తా పడిన సమయంలో పోలీసులు అప్రమత్తమైనందుకు ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఈ ఘటనలో ట్యాంకర్ సాంకేతిక లోపంలేదని, డ్రైవర్ తప్పు ఏమి లేదని తెలిపారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తాం

-కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్


సర్వేను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 16, ప్రభాతవార్త**

124 ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలో తెలంగాణ ప్రభుతం అదేశాల మేరకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న సర్వేను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, మునిసిపల్ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి అధికారులు వారి ఇళ్ల వద్దకు వెళ్లి సర్వే నిర్వహించడం జరుగుతుందని అన్నారు. సర్వే కోసం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌లో లబ్ధిదారుల వివరాలు పొందుపరచడం జరుగుతుందని అన్నారు. సొంత స్థలం ఉండి లేదా రేకుల ఇల్లు ఉన్న లబ్ధిదారులను ఎంపికచేసి వారు స్లాబు ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం తరపునుండి ఐదు లక్షల రూపాయల ఆర్థికసాయం అందించడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో పాండుగౌడ్, రామకృష్ణ, సత్యనారాయణ, ఎ.ఎం.సి కె.శ్రీనివాస్, సర్వేయర్లు ముస్తఫా, కుమార్, జయలక్ష్మీ, సుమన్, అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతలేని ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలి : రవీందర్ ముదిరాజ్



వినతిపత్రం అందజేస్తున్న రవీందర్ ముదిరాజ్

**జీడిమెట్ల, డిసెంబర్ 16, ప్రభాతవార్త**

సమాచార హక్కు చట్టం కింద ప్రజావాణిలో నాణ్యతలేని ప్లాస్టిక్ కవర్లు ఇస్తారు. ఫంక్షన్ హాల్స్‌లో.. హోటల్స్‌లో.. దేవాలయంలో విచ్చలవిడిగా వాడుతున్నారని దీనిని కట్టడి చేయాలని ప్రతి ప్రజావాణిలో డిప్యూటీ కమిషనర్ జోనల్ కమిషనర్‌కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. సమాచార హక్కు చట్టం కింద తమరు ఎలాంటి చర్యలు తీసుకున్నారు. దానికి సంబంధించిన వివరాలు ఇవ్వవలసిందిగా వినతిపత్రం ఇవ్వడము జరిగింది. ఈ కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్, ఎక్స్ కౌన్సిలర్ యేసు రత్నం, డీసీఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయాలి


కమిటీ నూతన నాయకులతో చంటి ముదిరాజ్

**సైఫాబాద్, డిసెంబరు 16 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ఆర్‌టిఐ బోర్డులు ఏర్పాటు చేయాలని, సమాచార కోరిన 30 రోజుల్లో ఇవ్వాలని, వ్యక్తిగత స్వేచ్చకు భంగం కలిగించరాదని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.చంటి ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కమిటీ కార్యాలయంలో రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా సూర స్రవంతి, రంగారెడ్డి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రామగళ్ళ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మల్లం శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలిగా వేముల పుష్పలత, సంయుక్త కార్యదర్శిగా దీపక్‌కులకర్ణి, గ్రేటర్ హైదరాబాద్ అధికార ప్రతినిధిగా రాసునూరి లక్ష్మణ్‌ను నియమిస్తూ నియామకపత్రాలను అందజేశారు. సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రమని, ప్రజలతోపాటు అధికారులు కూడా ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గ్రామ పంచాయితీ నుంచి పార్లమెంట్ వరకు సమాచారాన్ని పొందవచ్చునని ఆయన తెలిపారు.

## విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించే బాధ్యత నాది : సురేష్ రెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి

**జీడిమెట్ల, డిసెంబర్ 16, ప్రభాతవార్త**

విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించే బాధ్యత నాది అని సురేష్ రెడ్డి అన్నారు. సోమవారం సాయి బాబానగర్‌లో గల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వాష్రూమ్స్ లేక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి స్వయంగా వెళ్లి పరిశీలించారు. త్వరలోనే వాష్రూమ్స్ కట్టిస్తానని సురేష్ రెడ్డి హామీ ఇచ్చారు.

## నూతన వసతి గృహం మంజూరు చేయాలి

### ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్

**చేవెళ్ళ, డిసెంబరు 16, ప్రభాతవార్త**

బాలికల కళాశాల విద్యార్థులకు నూతన వసతి గృహంను మంజూరు చేయాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు.చేవెళ్ల మండల కేంద్రంలో కళాశాల బాలికలకు నూతనంగా వసతి గృహలను మంజూరు చేయాలని ఎస్ఎఫ్ఐ అద్వర్యంలో సోమవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ 2018 సంవత్సరంలో చేవెళ్లకు ఎస్సీ బాలికల, బాలుర వసతి గృహాలు మంజూరు చేశారని,కాని ఇప్పటి వరకు భవనా లను నిర్మించలేదన్నారు.కళాశాల భవనాలు అద్దేభవనాల్లో కొనసాగుతున్నాయని,అద్దె భవనాల్లో కొనసాగుతున్న కళాశాల వసతి గృహలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సాంఘిక సంక్షేమ శాఖ చేవెళ్ల డివిజన్ అదికారి వెంకట్ ప్రయత్నా లు చేస్తున్నారన్నారు.విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నూతన వసతి గృహలను మంజూరు చేయాల న్నారు. ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి శ్రీనివాస్, మొయినాబాద్ మండల అధ్యక్షుడు చరణ్‌గౌడ్, నాయకులు అనిల్ కుమార్, నవీన్, శివయాదవ్, సందీప్, ఆసిఫ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పండుగలకు బట్టలు పంపిణీ చేసిన ఘనత కెసిఆర్‌దే : ఎమ్మెల్యే మాధవరం

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 16, ప్రభాతవార్త**

కూకట్ పల్లి నియోజకవర్గంలో క్రిస్మస్ సందర్భం బిఆర్ఎస్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు డేవిడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, ఫాస్టర్ ఐజాక్‌లు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గంలోని ఫాస్టార్లకు ఎమ్మెల్యే సొంత నిధులతో బట్టల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుండి తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో అన్ని మతాల అన్ని కులాలకు వారి ప్రత్యేక పండగలకు బట్టలు పంపిణీ చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుదన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో ఆడపడుచులకు బతుకమ్మ చీరలను, ముస్లింలకు రంజాన్ తోఫా, క్రిస్మస్ వేడుకలకు పాస్టర్లకు బట్టల పంపిణీ చేయడంలేదని ఇలాంటి దౌర్భాగ్యమైన ప్రభుత్వం ఉండడం మన దురదృష్టకరమని అన్నారు. నియోజకవర్గంలోని క్రిస్టియన్ మతస్తులకు తామెప్పుడు అండగా నిలబడతామని ఎల్లవేళలా ఎవరికి ఎలాంటి కష్టం వచ్చినా తాము అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. అనంతరం పాస్టర్ ఐజాక్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా కేసీఆర్ ప్రభుత్వం స్థానికంగా ఎమ్మెల్యే కృష్ణారావు క్రిస్టియన్ వేడుకలకు ప్రజలందరికీ అండగా నిలబడుతూ నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పరిష్కరించే నాయకుడికి ప్రజల అభిమానం ఎప్పటికీ ఉంటుందని పాస్టర్ ఐజాక్ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, ఆవుల రవీందర్ రెడ్డి, పండల సతీష్ గౌడ్, సబిహా గౌసుద్దీన్, శిరీష బాబురావు, మందడి శ్రీనివాస రావు, శ్రీహరి మహేశ్వరి, రోజా రంగారావు, మాజీ కార్పొరేటర్, తూము శ్రావణ్ కుమార్, సతీష్ రావు, రేవరన్, పరలోక నేస్తం పి. ఐజాక్, ఫాస్టర్లు డానియల్, డేవిడ్, సువార్తమ్మ, రాజు, స్వామి, విజయపాల్, జాన్ పాల్, లాల్ బాబు, దేవదానం, సాంసన్, సుధాకర్ పాల్గొన్నారు.


ఫాస్టార్లకు బట్టల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

## రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు

: ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


నల్లకుంటలో స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ అమృత

**హైదరాబాద్, డిసెంబరు 16, ప్రభాతవార్త:**

అంబర్‌పేట నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనుల్లో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని డాక్టర్ చారిలైన్‌లో 20లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ ఎన్.అమృతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ చారిలైన్ వీధిలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా బస్తీలు, కాలనీలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో పార్టీలు, కులాలు, మతాలు ఉండవన్నారు. ఎక్కడ సమస్యలు నెలకొన్న నేరుగా తనను సంప్రదించి ఆయా అభివృద్ది పనులకు సహకరించాలన్నారు. ప్రజాధనంతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ఉండేలా స్థానిక పెద్దలు పర్యవేక్షించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు, బిఆర్ఎస్, బిజెపి నాయకులు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ కోర్టుకు హాజరైన మంద క్రిష్ణ మాదిగ


సికింద్రాబాద్ కోర్టుకు హాజరైన మంద క్రిష్ణ మాదిగ,ఎమ్మార్పీఎస్ నేతలు ఇటుక శ్రీకిషన్ మాదిగ,రాగటి సత్యం, తిప్పారపు లక్ష్మణ్ మాదిగ తదితరులు

**కంటోన్మెంట్,డిసెంబర్ 16 ప్రభాతవార్త:** మాదిగ మహిళ సమైఖ్య రాష్ట్ర నాయకురాలు దివంగత భారతి మాదిగ సంస్మరణ సభ సికింద్రాబాద్ కంటోన్మెంట్,మట్‌పోర్ట్ ప్లే గ్రౌండ్‌లో సభ నిర్వహించగా అప్పటి ముఖ్య మంత్రి కెసిఆర్ ఎమ్మార్పీఎస్ భారతి మాదిగ సంస్మరణ సభను భగ్నం చేసేందుకు పెట్టిన అక్రమ కేసుల్లో భాగంగా సోమవారం కోర్టులో విచారణకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద క్రిష్ణ మాదిగ హాజరైయ్యారు. ఆయనతో పాటు ఎం.ఎస్.పి.జాతీయ నాయకులు రాగటి సత్యం మాదిగ, ఇటుక శ్రీ కిషన్ మాదిగ, తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, నరేంద్ర బాబు మాదిగ, ఎన్.విజయరావ్ మాదిగ, ఎన్.విద్యా రావ్ మాదిగ, జే.పి.లత మాదిగలు పాల్గొన్నారు.

## యేసు క్రీస్తు సన్మార్గాన్ని స్పూర్తిగా తీసుకోవాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్



రసూల్‌పుర మినీ క్రిస్మస్ వేడుకల్లో ప్రార్థనలు చేస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే తదితరులు

**కంటోన్మెంట్,డిసెంబర్ 16 ప్రభాతవార్త:** క్రీసస్తు జీవితం త్యాగం సన్మార్గాన్ని స్పూర్తిగా తీసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. మినీ క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని సోమవారం 2వ వార్డు రసూల్‌పుర ఇందిరమ్మ నగర్‌లో న్యూ లైఫ్ పవర్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.

## అల్వాల్‌లో యువకుడి హత్య

**అల్వాల్, డిసెంబరు 16 ప్రభాతవార్త:**

స్నేహితులు మద్య వివాదం ఒకరి హత్యకు దారి తీసింది. గంజాయికి బానిసైన దోస్తులు పాత గొడవలను తవ్వుకుని కత్తులుతో దాడులు చేసుకున్న సంఘటన అల్వాల్‌లో చోటు చేసుకుంది. హత్యకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కానాజీగూడ ఇందిరానగర్‌లో నివసించే సైంధిల్(23) పెయింటర్ కాగా స్నేహితులు షేక్ రహీల్(22),నరసింహ(21)లు సెంట్రింగ్ కార్మికులు. ముగ్గురు సాయంత్రం అయ్యే సరికి మద్యంతో పాటుగా గంజాయి సేవించడం నిత్య కృత్యంగా మారింది. తాగిన మైకంలో బస్తీ వాసులుతో గొడవలకు దిగడం పరిపాటి. ఇదిలా ఉండగా ఆదివారం రాత్రి దావత్‌కు రమ్మని సైంధిల్ స్నేహితులు షేక్ రహీల్, నరసింహను ఆహ్వానించాడు. మద్యం సేవించిన తరువాత పాత గొడవలకు సంబంధించి స్నేహితులు మద్య వాదోపవాదాలు జరిగాయి. కోపోద్రిక్తుడైన సైంధిల్ ఇంట్లోని చాకుని తీసుకుని షేక్ రహీల్, నరసింహపై దాడికి ప్రయత్నించగా ఇరువురు అడ్డుకోవడంతో పాటుగా సైంధిల్ చేతిలోని చాకుని గుంజుకున్నారు. కోపంతో ఉన్న వారు సైంధిల్ కడుపులో విచక్షణా రహితంగా పొడిచారు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా సోమవారం మరణించాడు. నిందితులు షేక్ రహీల్, నరసింహలు పోలీసులు వద్దకు వచ్చి లొంగి పోయారు.

## నేడే ఘనంగా పెన్షనర్స్ డే వేడుకలు

**రవీంద్రభారతి, డిసెంబరు 16 ప్రభాతవార్త :**

తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో తెలంగాణ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 17 మంగళవారం ఉదయం 9నుండి మధ్యాహ్నం 2గంటల వరకు పెన్షనర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె.కొమురెల్లి, తూము అశోక్‌రెడ్డి, సూర్యకళలు తెలిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రముఖ గాయని ఆమని నేతృత్వంలో పలువురు పెన్షనర్స్‌చే తెలుగు, హిందీ వివిధ సినీగీతాలతోపాటు వివిధ సమస్యల పరిష్కరణకై చేపట్టు కార్యక్రమ వివరాలు, కార్యాచరణ అంశాలు, పరిష్కారం కోసం చేసే వివిధ పనులపై చర్చ జరపనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ సాంస్కృతిక, పర్యాటకశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, బిసి సంక్షేమం, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌లు, విశిష్ట అతిథులుగా ప్రభుత్వ సలహాదారు వేమ్ నరేందర్‌రెడ్డి, జీఎన్జీఓ నాయకులు ఎం.జగదీశ్వర్, ముజీమ్, శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రెడ్డి ఉమాదేవి, పి.విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

## విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో ప్రతిభకనబర్చాలి



సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో సిఎం కప్ క్రీడలను ప్రారంభిస్తున్న స్పోర్ట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి

**కంటోన్మెంట్,డిసెంబర్ 16 ప్రభాతవార్త:** విద్యార్థులు గ్రామ స్థాయి నుంచి ప్రపంచ స్థాయికి ఎదిగే విధంగా క్రీడా పోటీల్లో ప్రతిభకనబర్చాలని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి తెలిపారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాల మేరకు సోమవారం సికింద్రాబాద్ జింఖానా క్రీడా మైదానంలో హైదరాబాద్ జిల్లా స్థాయి సిఎం కప్ 2024 క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం నుండి క్రీడాకారులను మరింత ప్రోత్సహించేందుకు సిఎం రేవంత్ రెడ్డి క్రీడా యూనివర్సిటీని అందుబాటులోకి తెచ్చారన్నారు. ఈ క్రీడలకు ప్రభుత్వం 320 కోట్లు నిధులు కెటాయించినట్లు ఆయన తెలిపారు. ఈ పోటీల్లో హైదరాబాద్ జిల్లాలోని 16 మండలాలకు చెందిన 1,700 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలు ఈ నెల 21 వరకు కొనసాగుతాయన్నారు. విద్యార్థులకు 20 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్‌డిఓ సాయిరామ్, జిల్లా కార్యదర్శి శ్రీదేవి, రమేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పాండురంగా నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఏకగ్రీవం


పాండురంగానగర్ కాలనీ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వంశీకృష్ణశర్మను అభినందిస్తున్న కాలనీ వాసులు.

**హైదరాబాద్ డిసెంబరు 16, ప్రభాతవార్త :**

ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే కాలనీ ఎన్నికలకు నామినేషన్‌లు దాఖలు చేయాల్సి ఉండగా ఎవ్వరు పోటీలోకి రాకపోవడంతో పాండు రంగానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షున్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి వంశీకృష్ణశర్మ ఒక్కడే నామినేషన్ వేయడంతో అతన్ని అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు అజయ్‌సింగ్, సురేందర్ గౌడ్, చందర్ రావులు ప్రకటించారు. కాలనీ వాసులు స్వపక్ష విపక్ష ప్యానెళ్ళ నాయకులు కలిసి ఈ సారి నూతన అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని తీర్మాణం చేసి వంశీని నామినేషన్ వేయించారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షునిగా ఎన్నికైన వంశీ మాట్లాడుతూ ఇప్పటివరకు కాలనీలో ఎన్నికలు జరుగుతూ ఉండేవని అందరం ఒకే కుటుంబంలా కలిసి కట్టుగా ఉండి కాలనీ సంక్షేమానికి అభివృద్దికి పాటు పడాలని తనకు అవకాశం ఇవ్వడం ఎంతో ఆనందించతగ్గ విషయమని అన్నారు. కాలనీ వాసులు తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా కాలనీ అభివృద్దికి ప్రజా ప్రతినిధుల సంక్షేమ సంఘాల అధికారుల స్థానిక ప్రజల సహాకారంతో ముందుకు వెళతామన్నారు. ఈకార్యక్రమంలో కాలనీ నాయకులు ఉదయ్‌కుమార్, ఇందర్‌సింగ్, రామాంజనేయులు, శ్రీనువాస్‌గౌడ్, సుబ్బారాయుడు, వాసు, పాల్గొన్నారు.

## క్రిస్మస్ ఉత్సవాల రాష్ట్రస్థాయి నిర్వాహక కమిటి సభ్యుడిగా సాల్మన్ రాజ్

**చిక్కడపల్లి, డిసెంబరు 16 ప్రభాతవార్త:** తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్ రాజ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున నిర్వహించే క్రిస్మ స్ ఉత్సవాల రాష్ట్రస్థాయి నిర్వాహక కమిటీ సభ్యుడిగా నియ మిస్తూ రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి తఫ్సీర్ ఇక్బాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఐదుగురు సభ్యులతో ఏర్పా టు చేసిన కమిటీ క్రిస్మస్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణం లో జరిగే విధంగా ఈ కమిటీ పని చేస్తుంది. ఈ సందర్భంగా గోనె సాల్మన్ రాజు మాట్లాడుతూ క్రిస్మస్ ఉత్సవాల రాష్ట్రస్థా యి నిర్వాహక కమిటీ సభ్యుడిగా తన నియమించడం సంతోషంగా ఉందని, ప్రభుత్వం ఆశించిన మేరకు ఉత్సవాలు ప్రశాంతంగా జరిగే విధంగా తన వంతు కృషి చేస్తానని అన్నారు.

## టిపిసిసి లేబర్ సెల్ నాయకుల కృషి అభినందనీయం

### -పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్


కర పత్రాలను విష్కరిస్తున్న మహేష్ కుమార్ గౌడ్

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 16, ప్రభాతవార్త**

టి.పి.సి.సి. లేబర్ సెల్ ద్వారా తెలంగాణలో అన్ని జిల్లాలో నియోజకవర్గలలో కర పత్రాల ద్వారా సభలు ద్వారా, తెలంగాణ భవన నిర్మాణ కార్మికులు, ఇతర నిర్మాణ కార్మికులు, అన్ని వాణిజ్య సంస్థలో, పరిశ్రమలలో పని చేసే అర్హులైన కార్మికుల సంక్షేమం కోసం కార్మిక సంక్షేమ మండలి ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, భీమా పథకాలు, సామాజిక భద్రత కోసం, కార్మికుల హక్కుల కోసం మొదలగు ప్రొయోజనాలు కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు ఉన్నందున వాటి ప్రయోజనాలు లబ్ధిపొందడం కోసం కార్మికులకు అవగాహనా కార్యక్రమాలు చేసేందుకు టి.పి.సి.సి. లేబర్ సెల్ ద్వారా కృషి చేస్తామని టి.పి.సి.సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కి వివరించారు. అనంతరం వారి చేతుల మీదుగా కర పత్రాలను విష్కరణ జరిపించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ కార్మికుల సంక్షేమం కోసం శ్రమించి కష్టపడి పని చేస్తున్న టి.పి.సి.సి. లేబర్ సెల్ నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ రాంబాగ్ ప్రకాష్ గౌడ్, నల్ల సంజీవ రెడ్డి, శి.సుజీత్ గాంధీ, సప్పిడి భాస్కర్, కాందాడి సుదర్శన్ రెడ్డి, రమేష్, వీరేందర్ గౌడ్, తిరుపతి, మోహన్ రెడ్డి, మహేష్, తి.శ్రీధర్ గౌడ్, ఎండీ నయీమ్, దుర్గా సింగ్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డును మూసివేసిన అపార్ట్మెంట్ వాసులపై ప్రజావాణిలో ఫిర్యాదు

**నిజాంపేట్, డిసెంబర్ 16, ప్రభాతవార్త**

నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీ శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ఎదురుగా లత లేక్వ్యూ అపార్ట్మెంట్ వాసులు అక్రమంగా రోడ్డును మూసివేసి.. హనదారులకు ఇబ్బందులకు గురిచేస్తున్న విషయంపై సోమవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జర్నలిస్ట్ కాలనీ సంక్షేమ సంగం సభ్యులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ జర్నలిస్ట్ కాలనీ శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ఎదురుగా లత లేక్ వ్యూ అపార్ట్మెంట్ ముందట అపార్ట్మెంట్ వాసులు ఉదయం సాయంకాలం సేద తీరేందుకు.. కొన్ని సిమెంటు దిమ్మెలతో కూడిన కుర్చీలను వేసుకొని రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్పిస్తున్నారు. అపార్ట్మెంట్ ముందు టర్నింగ్ పాయింట్ వద్ద ఈ కుర్చీ దిమ్మలను వేయడం ద్వారా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గువుతున్నారు. దీనిపై అపార్ట్మెంట్ వాసులకు పలు మార్లు తీసివేయాలని కోరినపట్టికీ మొండిపట్టుతో కాలనీ వాసులు మాటను బేఖాతారు చేస్తున్నారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు అపార్ట్మెంట్ ముందట వేసిన సిమెంటు కుర్చీ దిమ్మెలను తక్షణమే తొలగించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కె వెంకట్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.లాలయ్య, అధ్యక్షుడు ఎ. మారుతిసాగర్ తదితరులు పాల్గొన్నారు.


అక్రమంగా నిర్మించిన సిమెంటు దిమ్మెలు

## తెలుగుజాతికే గర్వకారణం బాపు రమణలు

### -ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి

**నాంపల్లి, డిసెంబరు 16 ప్రభాతవార్త :**

స్వతహాగా గొప్ప చిత్రకారుడు, రచయితగా విభిన్న కళాకారులైన బాపు, రమణలు కళలు కళాకారుల అభున్నతి కోసం ఎంతగానో కృషిచేశారని, వారిరువురి మధ్య విడదీయరాని స్నేహబంధం, భిన్నత్వంలో ఏకత్వంగా ఒకరి గెలుపు కోసం మరొకరు నిలిచారని, వారు యావత్ తెలుగు జాతి గర్వించదగ్గ మహోన్నతులని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి అన్నారు. బాపు రమణ అకాడమీ ఆధ్వర్యంలో పద్మశ్రీ బాపు జయంతి సందర్భంగా బాపురమణ పురస్కారోత్సవం 2024కు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి విశిష్ఠ అతిథులు శేఖర్ కమల, ఆర్‌పి.పట్నాయక్, ఉత్తేజ్ తదితర అతిథులతో కలిసి ప్రముఖ కార్టూనిస్టు సురేంద్ర సత్కరించి బాపు పురస్కారం, ప్రముఖ రచయిత భువనచంద్ర సత్కరించి రమణ పురస్కారం; చలనచిత్ర రచయితగా 17సార్లు నంది అవార్డు అందుకున్న సినీరచయిత కళారత్న ఆకెళ్ళ వెంకట సూర్యనారాయణను ఘనంగా సత్కరించి జీవిత సాఫల్య పురస్కారం ప్రదానంచేసి వారికి శుభాభివందనలు తెలిపి రామకృష్ణ ఫౌండేషన్ సమర్పించిన కార్టూనిస్టు గాంధీ రూపొందించిన మనోహరాలు-గాంధీ కార్టూన్ల సంకలనంను ఆవిష్కరించి ప్రసంగించారు. పాటల మాంత్రికుడు భువనచంద్ర పాటలే కాదు కథలు, నవలలు, వ్యాసాలు వ్రాశారని, సాంస్కృతికమూర్తిగా నిలిచిపోయారని ఆయనకు రమణ పురస్కారం అందడం ఎంతో సబబు ఆనందంగా ఉందన్నారు. అనంతరం అతిథులు ప్రసంగించారు.


వెంకటసూర్యనారాయణ దంపతులకు జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరిస్తున్న రమణాచారి, శేఖర్, ఉత్తేజ్, పట్నాయక్ తదితర అతిథులు

## 21 నుంచి "పత్రీజీ ధ్యాన మహాయాగం"


కార్యక్రమ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న విజయభాస్కర్‌రెడ్డి, శివప్రసాద్, సాంబశివరావు, నిర్మల తదితరులు

**హైదరబాద్, డిసెంబరు 16,ప్రభాతవార్త:**

ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించడం ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు పత్రీజీ ధ్యాన మహా యాగాన్ని నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ పిరమిడ్ రీచువల్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ట్రస్ట్ ప్రతినిధులు మారం శివప్రసాద్, సాంబశివరావు, నిర్మల తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలంలోని కైలాసపురి పత్రీజీ శక్తిస్థల్‌లో 11 రోజుల పాటు ఈ మహా జ్ఞాన కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఆధ్యాత్మిక ప్రవచనాలు సత్సంగాలు ఉంటాయని తెలిపారు. పది రోజుల పాటు దేశంలోనే ప్రముఖ గురువులచే ప్రవచన కార్యక్రమాలు ఉంటాయని ఈ కార్యక్రమాల కు సుమారు లక్షమంది హాజరు అవుతారని ఈనేపథ్యంలో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమాల్లో భాగంగా 225 గంటలపాటు అఖండ ధ్యానం కొనసాగుతుందని చెప్పారు. విశ్వశాంతి కోసం జరుగుతున్న ఈ కార్యక్రమాలకు అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, పిరమిడ్ మెడిటేషన్ డైరెక్టర్ ఆనంద్ బుద్ధ ధూళిపాటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


**IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD.**
**OS NO. 5452 OF 2024**

Between:
**Smt. Satwant Malhotra & 2 Others**
**1. Satwant Malhotra,** W/o. Late Malhotra Amarjit Singh.
**2. Sandeep Kanda,** D/o. Late Malhotra Amarjit Singh.
**3. Mandeep Malhotra,** S/o. Late Malhotra Amarjit Singh.
**...Plaintiffs**
AND
**MRO Ameerpet & All concerned**
**...Defendants**

Please take notice that the above named Plaintiffs herein **Smt. Satwant Malhotra and 2 Others** has filed the above suit for Legal heirs and this Honorable court has posted the above matter on **27-12-2024** for your appearance. If you fail to appear in person or through counsel on the above said date at **10.30 A.M.,** the matter will be decide as per law in your absence by setting you Ex-parte.

//BY ORDERS OF THE COURT//

**Sri H. CHANDRASEKHAR**
**Advocate**
#301, 3rd Floor, Block-"A" Swati Apartment, Saleem Nagar Colony, Malakpet, Hyderabad.
**Cell : 9701545712.**


## కంటోన్మెంట్ బోర్డులో సంబరాలు


సంబరాలు జరుపుకుంటున్న జాయింట్ సిఈఓ పల్లవి వనీ, బోర్డు ఉద్యోగులు, తదితరులు

**కంటోన్మెంట్,డిసెంబర్ 16 ప్రభాతవార్త:**

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు ఎక్సలెన్స్ అవార్డు దక్కినందుకు సోమవారం కంటోన్మెంట్ బోర్డు ప్రాంగణంలో బోర్డు జాయింట్ సిఈఓ పల్లవి విజయ్ వనీ, బోర్డు ఉద్యోగులు సంబరాలు జరుపుకున్నారు. అదే విధంగా డిఫెన్స్ ఎస్టేట్ డేను పురస్కరించుకొని సోమవారం బోర్డు ఉద్యోగులతో క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. మ్యాచ్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఛీఫ్ ఇంజనీర్ సి.హెచ్.ఉమా శంకర్, ఇంజనీర్లు దినేశ్, సూపరిండెంట్‌లు అనణి తదితరులు పాల్గొన్నారు.





తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ :: సరూర్‌నగర్ సర్కిల్-5 GHMC

నిట్ నం.19/EE5/SRNR/GHMC/2024-25, తేది: 16.12.2024. పని పేరు: "GYM & కాలిబాట" పని యొక్క (2) నం.ల కొరకు, అంచనా మొత్తం: రూ.52.50 లక్షలు, బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ & సమయం: 23.12.2024 మ.3.01 గం. అధికారి పేరు & చిరునామా, సెల్ నం.: శ్రీ కె. శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, సరూర్‌నగర్ సర్కిల్-5, GHMC, (M) 9989930602. తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.eprocurement.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-5, GHMC

DIPR.No.7958-PP/CL/Advt/1/2024-25, తేది: 16.12.2024

## పారిశుద్ధ్య నిర్వహణ పై కార్పొరేటర్ లచ్చిరెడ్డి ఆగ్రహం



పారిశుద్ధం పై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం డిసెంబరు16, ప్రభాతవార్త :** హయత్ నగర్ సర్కిల్ జిహెచ్ఎంసి కార్యాలయంలో అస్తవ్యస్తంగా మారిన పారిశుద్ధం పై నిర్వహించిన సమీక్ష సమావేశానికి బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో ఎక్కడ చెత్తకుప్పలు అక్కడే పేరుకు పోతున్నాయని, పలుమార్లు కాలనీవాసులు పారిశుద్ధ్య సిబ్బందికి ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడంలేదని. పారిశుద్ధ కార్మికులు విధులు సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు మరియు ప్రతిరోజు క్రమం తప్పకుండా ప్రతి కాలనీలో రోడ్లు శుభ్రపరచాలని, ఎప్పటికప్పుడు చెత్త కుప్పలను తొలగించాలని గౌరవ కార్పొరేటర్ గారు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిఈ దామోదర్ రావు, శానిటేషన్ డిఈ నీలిమ, రాంకీ జోనల్ హెడ్ వేణు కుమార్ ,విఠ యాదగిరి,యుబిడి మేనేజర్ మేధ, ఎస్ఎస్ అజీమ్ ఉద్దీన్, జవాన్ యాదయ్య మరియు పార్టీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి,శరత్ కుమార్, కామేష్, పవన్ రెడ్డి, కిషోర్, సురేష్ కుమార్ , ఎస్ఎఫ్ఎ పురుషోత్తం,చంద్రశేఖర్, శ్రీనివాస్, మై రాజ్, ప్రకాష్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్



**మల్కాజిగిరి డిసెంబరు16,ప్రభాతవార్త :** ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని పి వి ఎన్ నగర్ లో 15 లాక్స్ తో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సిసి రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమం లో బాబు,సంపత్ రావు, కిషోర్, హరీష్,ఉదయ్,బాల పెంటయ్య,నాగేష్, ఉమేష్,శ్రీనివాస్, మోహన్ తదితరులు పాల్గొన్నారు .

## సిఎం సహాయనిధి చెక్కు అందజేత



**మల్కాజిగిరి డిసెంబరు16,ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు మోలాలి డివిజన్ సాయినాథపురం కు చెందిన రమేష్ కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 60,000 ఎల్ఓసి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ డివిజన్ ప్రెసిడెంట్ పోతుల వినోద్ యాదవ్ వెంకటేశ్వర్ రావు, చింకు శ్రీనివాస్. శ్రీనివాస్, ముక్తార్, శ్రీకాంత్, పాండు, చారి, తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటాం : నవజీవన్‌రెడ్డి



కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

**హయత్‌నగర్, డిసెంబరు 16 ప్రభాతవార్త:** బంజారా కాలనీలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. మార్నింగ్‌వాక్‌లో భాగంగా ఆయన సోమవారం కాలనీలో పర్యటించి కాలనీవాసుల సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో విద్యుత్ స్థంభాలు సరిపడ లేదని విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రివేళల్లో చిన్నారులు, మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చీకటి కారణంగా దొంగతనాలు, ప్రమాదాలు జరుగుతాయని ఇళ్లల్లోంచి ప్రజలకు బయటకు రావడానికి భయపడుతున్నారని వివరించారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సాధ్యమయినంత త్వరలో సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాలునాయక్, కాలనీ ప్రతినిధులు మోహన్, భగవాన్, రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేను కలిసిన తట్టిఅన్నారం గ్రామస్తులు

**హయత్‌నగర్, డిసెంబరు 16 ప్రభాతవార్త:** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం గ్రామంలో 12 కాలనీలకు సంబంధించి డ్రైనేజీ ట్రంక్‌లైన్ పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కరాచారి ఆధ్వర్యంలో ప్రతినిధులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి విన్నవించారు. ట్రంక్‌లైన్ ఔట్‌లెట్ పనులకు సంబంధించి డీపీఆర్ సిద్ధంగా ఉందని వెంటనే పనులను ప్రారంభించి 12 కాలనీల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ పెద్దఅంబర్‌పేట కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి టెండర్ ప్రక్రియను పూర్తిచేసి పనులను ప్రారంభించి త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సెంట్రల్ అసోసియేషన్ ప్రతినిధులు మధు, ఫణిరెడ్డి, మానయ్య, శంకర్, వీరారెడ్డి, సీతారాంరెడ్డి, లక్షణచారి, రవి ఉన్నారు.

## గాంధీనగర్‌లో కమ్యూనిటీ భవనం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**వనస్థలిపురం డిసెంబరు16,ప్రభాతవార్త :** బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని గాంధీ నగర్ కాలనీ నందు నూతనంగా నిర్మించిన కమ్యూనిటి హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరైయ్యారు.ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ... సుధీర్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.మా యొక్క కాలనీ అభివృద్ధికి వారు ఎంతో సహాయసహకారాలు అందించారు అని తెలిపారు.అలాగే కమ్యూనిటి హాల్ చుట్టూ నూతనంగా కంపాండ్ వాల్ మరియు సీ.సీ.బెడ్ నిర్మించాలని కోరారు. అలాగే స్ట్రామ్ వాటర్ నీరు పోవడానికి ట్రంక్ లైన్ నిర్మించాలని కోరారు.అలాగే త్రీ ఫేస్ కరెంటు సౌకర్యం కల్పించాలని కోరారు.అనంతరం సుధీర్ రెడ్డి గారు మాట్లాడుతూ తప్పకుండా మీరు ఆడిగిన సమస్యలు దశలవారీగా పరిష్కారం చేయడం జరుగుతుంది అని తెలిపారు.అలాగే గతంలో చిన్నపాటి వర్షానికి కాలనీలు మొత్తం వరదనీటితో మునగడం జరిగేది అని తెలిపారు.ప్రస్తుతం అట్టి సమస్యలు లేవని నూతన బాక్స్ మరియు డ్రైన్స్ నిర్మాణం చేపట్టి ముంపు సమస్యల నుంచి విముక్తి చేయడం జరిగిందని గుర్తు చేశారు.ప్రస్తుతం ఉన్న జోనల్ కమిషనర్ కాంగ్రెస్ పార్టీకి తొత్తుగా పనిచేస్తు,మాకు ఎలాంటి నిధులు ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు్టి కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి,సుమన్ గౌడ్,అనిల్ చౌదరి,మాధవరం నర్సింగ్ రావు,గంగం శివశంకర్,ముద్దగోని సతీష్ గౌడ్, జగన్మోహన్ రావు మరియు కాలనీ అధ్యక్షులు మల్లారెడ్డి ఉపాదక్షులు నర్సింహారెడ్డి,కోశాధికారి లక్ష్మీనారాయణ, రాంబాబు,ప్రభాకర్ రావు,అరిఫ్,శశిధర్ పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి కృషి : కేంద్రమంత్రి రాందాస్ అథవాటే



సమావేశంలో ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి రాందాస్ అథవాలే, చిత్రంలో గంగారం, నాగభూషణం తదితరులు

**మలక్‌పేట, డిసెంబరు 16 ప్రభాతవార్త:** దివ్యాంగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తామని కేంద్రమంత్రి రాందాస్ అథవాలే పేర్కొన్నారు. ప్రపంచ వికలాంగుల మాసోత్సవాలను పురస్కరించుకుని ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఫర్ ది డిసేబుల్డ్(ఫెడ్) ఆధ్వర్యంలో మలక్‌పేట లూయి బ్రెయిల్ పార్కులో జరిగిన వికలాంగుల దినోత్సవ వేడుకలలో ఆయన బ్రెయిల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంప్యూటర్, యోగా, బ్రెయిల్ శిక్షణా కేంద్రాన్ని ఆయన ప్రారంభించి పలువురు దివ్యాంగులకు కుట్టుమిషన్లు, చేతికర్రలను అందించారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు సికింద్రాబాద్‌లో నిర్వహిస్తున్న అంధుల ఉపాధ్యాయ శిక్షణా కేంద్రాన్ని బోయిన్‌పల్లిలో ఉన్న జాతీయ మానసిక వికలాంగుల సంస్థలో కలపాలని కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై మంత్రి స్పందిస్తూ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. వికలాంగులకు అన్ని విధాల సహకారం అందిస్తామని తెలిపారు. ఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్ని కార్యక్రమాలకు తమవంతు తోడ్పాటును అందిస్తామన్నారు. వికలాంగులకు సేవలందిస్తున్న ఫెడ్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఫెడ్ ఛైర్మన్ గంగారాం, గజం నర్సింగరావు, చెరుకు నాగభూషణం పాల్గొన్నారు.

## ఘనంగా ఎల్‌ఎఫ్‌జెసి గోల్డెన్ జూబ్లీ వార్షికోత్సవాలు



ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ కళాశాల వార్షికోత్సవంలో పాల్గొన్న బ్రదర్ జైకో గెర్వాసిస్, జాన్ క్రల్లారకల్, ఫ్రాంకీ నరోనా తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 16 ప్రభాతవార్త :** ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ జూనియర్ కళాశాల గోల్డెన్ జూబ్లీ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమానికి జైకో గెర్వాసిస్ సెయింట్ గాబ్రియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ బ్రదర్స్, ఛైర్మన్, ప్రావిన్షియల్ సుపీరియర్, రెమ్లోని సెయింట్ గాబ్రియల్ బ్రదర్స్ సుపీరియర్ జనరల్ డియోన్లీ టపారెల్లో ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జాన్ కల్లారకల్, బ్రదర్ ఫ్రాంకీ నరోన్హా, బ్రదర్ ఎం.ఎ.జార్జ్, బ్రదర్ విన్సెంట్‌రెడ్డి, ప్రిన్సిపల్ అరుణ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యా సేవలో గత 50 సంవత్సరాలుగా సేవలు అందిస్తుందని, 1974లో చిరాగ్ అలీలేన్‌లో ప్రారంభించి ఉప్పల్ క్యాంపస్ స్థాపించి సేవలు అందిస్తుందని తెలిపారు. ఎపి, తెలంగాణలో ఇంటర్ విద్యకు పవర్ హౌజ్‌గా గుర్తింపు పొందిందని తెలిపారు. ఎల్‌ఎఫ్‌జెసి ఎయిమ్స్, జిప్మలర్ ఎఫ్ఎంసి, ఎంసెట్, ఐటి, మెడిసిన్, ఇంజనీరింగ్ విద్య, సివిల్ సర్వీసెస్‌లో రాణించారని కొనియాడారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులతో సమ్మేళనం నిర్వహించారు. వివిధ రంగాలలో సేవలు అందించిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ అనుభవానుల పంచుకున్నారు. బ్రదర్ అరుణ్‌ప్రకాష్ మాట్లాడుతూ రెండేళ్ల పాటు ఉత్సవాలు జరుగుతాయని, పూర్వ విద్యార్థులతో చర్చలు, పరస్పర చర్యలు ప్రణాళికబద్ధమైన శ్రేణి భవిష్యత్ తరాలకు ప్రేరేపించడం ద్వారా తమ కళాశాల విశిష్టతను వివరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు ఆహుతులను ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదవులు అలంకారప్రాయం కాకూడదు.. పార్టీ పటిష్టతకు పని చేయండి: కెఎల్‌ఆర్



మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షునిగా నియమితులైన బాలాపూర్ క్యారగారి శ్రీధర్‌కు ఉత్తర్వులను అందజేస్తున్న కెఎల్‌ఆర్ : చిత్రంలో అమరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు

**సరూర్‌నగర్, డిసెంబరు 16 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేయాలని నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని బాలాపూర్ పాత గ్రామానికి చెందిన దళిత నాయకుడు క్యారగారి శ్రీధర్ మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్సీ సెల్ నూతన అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఈ మేరకు టిపిసిసి ఎస్సీ విభాగం రాష్ట్ర ఛైర్మన్ నగరిగారి ప్రీతమ్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను శ్రీధర్ సోమవారం తుక్కుగూడలోని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ కేంద్ర కార్యాలయంలో బాలాపూర్ గ్రామానికి చెందిన టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎర్ర జైహింద్‌కుమార్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్‌నింగని జంగయ్యతో పాటు వివిధ గ్రామాల నాయకుల సమక్షంలో కెఎల్‌ఆర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా కిచ్చెన్న మాట్లాడుతూ పార్టీ పదవులు అలంకార ప్రాయం కాకూడదనీ పదవులు పొందిన వారు వాటికి న్యాయం చేయాలని సూచించారు. ఈ మేరకు పార్టీ పటిష్టతమే ధ్యేయంగా పని చేసి పేరు నిలుపుకోవాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లో ప్రచారం చేసి పార్టీ ప్రతిష్టను పెంచాలని ఆయన కోరారు. క్యారగారి శ్రీధర్ మాట్లాడుతూ పార్టీ పదవిని ఇప్పించిన కెఎల్‌ఆర్‌కు, తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీకి అంకిత భావంతో పని చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు పుట్లగళ్ళ జగన్, గట్టు బాలకృష్ణ, సూర్ణగంటి విజయ్, బాలాపూర్ కాంగ్రెస్ నేతలు కప్పాటి అంజయ్య, భరత్, భాను, క్యారగారి శ్రీరాం, పెద్దన్నగారి సుదర్శన్, జొన్నాడ సురేందర్, బొర్ర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : ఉప్పల



ట్రాక్ షూట్లను అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 16 ప్రభాతవార్త:** ప్రో కబడ్డీ జూనియర్స్ లో జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిపి తెలంగాణకు పేరు తేవాలని ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్, ఐవిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పేర్కొన్నారు. నాగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రోకబడ్డీ జూనియర్స్ జాతీయ స్థాయి పోటీలకు సన్నహకంగా నిర్వహించిన శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరై క్రీడాకారులకు ట్రాక్ షూట్ లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన క్రీడ పాలసీ ద్వారా సిఎం రేవంత్ రెడ్డి క్రీడలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. నాగోల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తాము ఎల్లప్పుడూ నోసాతో కలిసి సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మండల రామారావు, హెడ్ మాస్టర్ లక్ష్మీదేవి, నాగోల్ జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కంధికంటి ఖన్నా గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ, పాఠశాల సబ్యులు చంద్రశేఖర్ ఆజాద్, పల్లే లింగంగౌడ్, నాళ్ల ఉమామహేశ్వర్ గుప్త, జగదీష్, రంజిత్ గౌడ్, ఉపాధ్యాయులు రవి కుమార్, విమల, శంకర్ నాయక్, మమత తదితరులు పాల్గొన్నారు.

## బిఎస్‌పిని బలోపేతం చేస్తాం : బహుగుణ నాయక్



బహుగుణను సన్మానిస్తున్న నాయక్‌లు

**సరూర్‌నగర్, డిసెంబరు 16 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీని బలోపేతంగా చేస్తానని ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు కేతావత్ బహుగుణ అన్నారు. పార్టీ అధ్యక్షునిగా ఎన్నికైనందుకు అల్మాస్‌గూడ కాలనీల్లోని పలువురు గిరిజన నాయకులు బహుగుణను శాలువా, బొకేలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎస్‌పి తరపున బడుగు, బలహీన వర్గాల సమస్యలపై పోరాడుతామనీ అదే విధంగా సమాజంలో జరిగే అక్రమాలు, అన్యాయాలపై పాలకులను నిలదీస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వాస్‌రాం నాయక్, మత్రు నాయక్, భద్రు నాయక్, యోగి నాయక్, మహేందర్ నాయక్, అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో ఘనంగా సెమి క్రిస్మస్ వేడుకలు



ఉప్పల్ స్వరూప్‌నగర్‌లో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 16 ప్రభాతవార్త :** ఉప్పల్ సౌత్ స్వరూప్‌నగర్‌లో ఉప్పల్ చర్చిస్ పాధర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ క్రిస్మియస్ పండు ప్రతి ఒక్కరికి ప్రేమ, శాంతి, ఆనందాన్ని పంచాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. క్రిస్మస్ సంబరాలకు ప్రభుత్వం నుంచి తగు ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె తెలిపారు. అనంతరం క్రైస్తవ మత్త పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ చర్చిస్ పాదర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు బిషప్ జాషువా, గోన ఫిలిప్, సల్ల ప్రభాకర్‌రెడ్డి, ఆనందకుమార్, రమేష్‌బాబు, వసంతకుమార్, అగ్రిపరాజు, గోనె అనిల్‌కుమార్, ఆనంద్ గ్లోయ్, రమేష్‌పాల్, జాన్‌వెస్లీ, తెజోమయ తదితరులు పాల్గొన్నారు.

## రూ. కోటి వ్యయంతో డ్రైనేజీ పనులు : బండారు శ్రీవాణి



వివేక్‌నగర్‌లో డ్రైనేజీ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 16 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్ వివేక్‌నగర్‌లో రూ.కోటి వ్యయంతో చేపడుతున్న డ్రైనేజీ పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులు వేగవంతం చేయాలని కోరారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆమె కోరారు. పనులు చేయడంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో డిఇ నాగమణి, ఎఇ శ్వేత, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి దామోదరను కలిసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

**మల్కాజిగిరి డిసెంబరు16, ప్రభాతవార్త** తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య,కుటుంబ సంక్షేమ మరియు సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రివర్యులు దామోదర రాజ నరసింహాని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కలిసి మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిని మరిన్ని సదుపాయాలతో , పేద ప్రజలకు వైద్యం చేరువయ్యేలా ఆధునిక వసతులతో అనగా అదనంగా... ఆపరేషన్ థియేటర్, 5 పడకల డయాలసిస్ యూనిట్, ట్రౌమ కేర్ యూనిట్, సి.టి.స్కాన్ సదుపాయాలు, డయాగ్నొస్టిక్ ల్యాబ్, బ్లడ్ బ్యాంక్, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చికిత్స చేసేందుకు అదనంగా మరో భవన సముదాయం నిర్మించాలని,ఒక బోరేవెల్ ఏర్పాటు చేయాలని, హాస్పిటల్లో లిఫ్ట్ తరచూ రిపేర్ అవుతుందని దానికి సరైన మేంటెనెన్స్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని,పేషంట్ల అటెండర్ల కొరకు బాత్రూంలు నిర్మించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి అభ్యర్థనను పరిశీలించి సంబంధిత అధికారులను ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

### అంబేద్కర్‌కు వినతిపత్రాలు ఇచ్చే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలి: సబితారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబరు 16 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ, అమానవీయ, అణచివేత విధానాలకు నిరసనగా అదే విధంగా లగచర్ల ఘటనలో రైతులపై నమోదు చేసిన అక్రమ కేసులు ఎత్తివేసి వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తెలంగాణ బిఆర్ఎస్ తరపున పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు ఇచ్చే కార్యక్రమాలను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి పార్టీ శ్రేణులను కోరారు. ఈ మేరకు మహేశ్వరం నియోజకవర్గవ్యాప్తంగా మంగళవారం ఉదయం 11 గంటలకు అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు సమర్పించి రాష్ట్ర ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేయాలని ఆమె సూచించారు. ఈ మేరకు జరిగే నిరసన కార్యక్రమాల్లో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో హాజరుకావాలని సబితారెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు యమునారాణికి డాక్టరేట్

**ఉప్పల్, డిసెంబరు 16 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు డా.యమునారాణికి డాక్టరేట్ పట్టా అందుకుంది. ఈ సందర్భంగా జెఎన్‌టియు హైదరాబాద్ విశ్వ విద్యాలయం నుంచి కంప్యూటర్ సైన్స్ విభాగంలో అచార్య సుమజ్ఞా పట్నాయక్ పర్యవేక్షణలో ఆమె డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఏ స్టడీ అన్ వర్క్ ఫ్లో ప్రెడిక్షన్ ఫర్ హెల్త్ కేర్ యూజింగ్ ప్రాసెస్ మైనింగ్ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను జెఎన్‌టియు నుంచి పిహెచ్‌డి డిగ్రీ పట్టా పొందారు. ఈ సందర్భంగా యమునారాణిని కళాశాల ప్రిన్సిపల్ డా.కె.విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ డా.ఎన్.రవిప్రసాద్, అకడమిక్ కోఆర్డినేటర్ కె.గీత, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

## గంగారెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే



గంగారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 16 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ మార్గదర్శి కాలనీకి చెందిన కాలనీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు గంగారెడ్డి సతీమణి సత్తెమ్మ ఇటీవల మరణించడంతో సమాచారం తెలిసిన మాజీమంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సోమవారం వారి నివాసానికి వెళ్లి గంగారెడ్డిని వారి కుటుంబ సబ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వర నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, జహంగీర్, కంచర్ల శేఖర్, నేలకొండ శ్రీనివాస్ రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, జగన్మోహన్ రెడ్డి, జాహిద్, శ్యాం గుప్తా, అనురాధ, కాలనీవాసులు పాల్గొన్నారు.

### రవాణా రంగం కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి



రామంతాపూర్‌లో సిఐటియు జెండా అవిష్కరిస్తున్న సిఐటియు నేత బి.నర్సింగ్‌రావు, జె.వెంకన్న తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 16 ప్రభాతవార్త :** రవాణా రంగంలో పనిచేస్తున్న డ్రైవర్లు, వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిఐటియు ఆల్ ఇండియా ట్రాన్స్‌పోర్టు యూనియన్ జిల్లా బాధ్యులు బంగారు నర్సింగ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఉప్పల్, రామంతాపూర్, చిలుకానగర్ తదితర ప్రాంతాల్లో ఆటో ట్రాలీ, డిసిఎం, లారీ కాఇర్మకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ డ్రైవర్లపై ఆర్‌టిఏ అధికారుల వేధింపులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఒలా, ఉబర్ యాప్స్ నియంత్రించాలని, ప్రభుత్వ యాప్ తీసుకుని రావాలని డిమాండ్ చేశారు. పార్కింగ్ స్థలాలు కేటాయించి వారికి డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త మోటర్ వాహనాల చట్టం సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు, ఉప్పల్ కార్యదర్శి జె.వెంకన్న మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని తెలిపారు. పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో ట్రాలీ యూనియన్ నేతలు వెంకన్న, యాదయ్య, ఎ.వెంకటేష్, ఎల్లయ్య, పర్వతాలు, నరసింహా, దశరద్, యాదగిరి, శేఖర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ అద్దెభవనాల బిల్లులను వెంటనే చెల్లించాలి

**: అధ్యక్షుడు కూరెళ్ల మహేష్‌కుమార్**



సమావేశంలో ప్రసంగిస్తున్న కూరెళ్ల మహేష్‌కుమార్

**మలక్‌పేట, డిసెంబరు 16 ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న అద్దె భవనాల బిల్లును వెంటనే చెల్లించాలని తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ల మహేష్ కుమార్ డిమాండ్ చేశారు. మూసారాంబాగ్ చౌరస్తాలోని కట్టెల మండి హాస్టల్‌ను ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల సంక్షేమాన్ని విస్తరిస్తోందని ఆరోపించారు. తెలంగాణన సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ గత ఆరునెలలుగా అనేక ఉద్యమాలు, పోరాటాలు చేయడంతో ప్రభుత్వం పెంచిన డైట్, కాస్మోటిక్ ఛార్జీల పెంపు మెనూ ప్రారంభోత్సవ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. పెండింగ్‌లో ఉన్న అద్దెభవనాల కిరాయిలు, జీతాలు వెంటనే ఇవ్వాలని... డైట్, కాస్మోటిక్ ఛార్జీల పెంపుపై వెనకడుగు వేసినా, ఆలస్యం చేసినా విద్యార్థి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మేడిరాజు, ఉపాధ్యక్షుడు ఈర్లప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిమ్మల సతీష్, కోఆర్డినేటర్ మచ్చుసు ధాకర్, ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ తరుణ్, కార్యదర్శి శివ, భాను, ఉదయ్ పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారులు ఎంపిక కసరత్తులు షురూ



అంబేద్కర్‌నగర్‌లో సర్వే చేస్తున్న మీర్‌పేట్ కమీషనర్ జ్ఞానేశ్వర్: చిత్రంలో కార్పొరేటర్ బాలమణి, ఓం ప్రకాశ్ తదితరులు

**సరూర్‌నగర్, డిసెంబరు 16 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సందర్భంగా కమీషనర్ ఆర్.జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో కార్పొరేషన్‌లోని డివిజన్లలో సర్వే బృందాలు లబ్ధిదారుల ఎంపిక కోసం చేస్తున్న కసరత్తుల్లో భాగంగా రంగంలో దిగాయి. ఈ మేరకు డివిజన్లలో పర్యటించి గుర్తించిన ఇళ్ళల్లో నిరే శించిన పత్రాలు తదితర వాటిని పరిశీలించాయి. కమీషనర్ జ్ఞానేశ్వర్, ఎఇఇ బిక్కూ నాయక్ 19వ డివిజన్ జిల్లెలగూడ అంబేద్కర్‌నగర్ కాలనీలో పర్యటించారు. ఈ కార్యక్ర మంలో స్థానిక కార్పొరేటర్ బైగళ్ళ బాలమణి, కాలనీ అధ్యక్షుడు బైగళ్ళ ఓం ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా 24వ డివిజన్ మీర్‌పేట్ పాత గ్రామంలో కార్పొరేషన్ రెవెన్యూ ఆఫీసర్ డి.చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది కీసర శ్రీనివాస్‌రెడ్డి తదితరులు సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ నాయకుడు తీగల సాయినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గృహిణి అదృశ్యం

**హయత్‌నగర్, డిసెంబరు 16 ప్రభాతవార్త:** పిల్లలను ఇంట్లో వదిలేసిన తల్లి కనిపించకుండా పోయిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... తుర్కయాంజాల్ మున్సిపాలిటీ మునుగనూర్ గ్రామానికి చెందిన శంకర్ లారీడ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. అతను తన విధులకు వెళ్లగా భార్య సురేఖ, ఇద్దరు పిల్లలు ఇంట్లోనే ఉంటారు. ఈనెల 14న ఉదయం 5 గంటల సమయంలో ఆమె పిల్లలను ఇంట్లోనే వదిలేసి బయటకు వెళ్లింది. భర్త ఇంటికి వచ్చిచూడగా ఆమె కన్పించలేదు. పిల్లలు మాత్రమే ఉన్నారు. బంధువులు, స్నేహితులను విచారించినా ఫలితం లేకపోవడంతో శంకర్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.